జోనల్ మీట్ క్రీడలు షురూ..

అల్వాల-చెప్యాల గురుకులంలో క్రీడా కారుల గౌరవందనం స్వీకరిస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల సెక్రటరీ నవీన్ నికోలస్

- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకులాల్లో నాణ్యమైన విద్య
- విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలి
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలల సెక్రటరీ నవీన్‌నికోలస్
- మిరుదొడ్డి మండలంలో జోనల్ మీట్ క్రీడలు ప్రారంభం
- హాజరైన 1020 మంది క్రీడాకారులు

మిరుదొడ్డి, అక్టోబర్ 13 : విద్యార్థులు చదువు తోపాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల సెక్రటరీ నవీన్ నికోలస్ అన్నారు. మండలంలోని అల్వాల-చెప్యాల గ్రామాల శివారుల్లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో ఈ నెల 13వ తేదీ నుంచి 16 వరకు జరిగే సిద్దిపేట-కామారెడ్డి జిల్లాలకు చెందిన 12 గురుకుల పాఠశాల, కళాశాలలకు చెందిన 1020 మంది క్రీడాకారులకు జోనల్ మీట్ క్రీడలను జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించి జోనల్ మీట్ క్రీడలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల సెక్రటరీ నవీన్ నికోలస్ మాట్లాడుతూ విద్యార్థులకు అండర్-14, 17,19 విభాల్లో కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, క్యారమ్స్, చెస్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా నాణ్యమైన గుణాత్మకమైన విద్యనందస్తున్నామన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన క్రీడాకారులకు ప్రత్యేకమైన శిక్షణ అందిస్తూ వారిని ఉన్నతులుగా తీర్చదిద్దడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్‌సీవో నిర్మల, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, సుజాత, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌తో బంగారు భవిష్యత్

షాట్‌పుట్ వేస్తున్న క్రీడాకారులు

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 13 : అథ్లెటిక్స్‌తో ఆరోగ్యంతోపాటు బంగారు భవిష్యత్ ఉంటుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి అండర్-14,16,1820 కేటగిరీలో బాలబాలికలకు వేర్వేరుగా శుక్రవారం ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అథ్లెటిక్స్‌లో క్రీడాకారులు జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. క్రీడలతో మానసికోల్లాసంతోపాటు ఉద్యోగావకాశాలు వస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు అండర్-14 బాల బాలికల విభాగంలో తేజస్విని, మౌనిక, రాహుల్, అరవింద్, గణేశ్, దీక్షిత, అండర్-16 విభాగంలో అజయ్, అక్షిత, విష్ణువర్ధన్, నందు, సిరి, హారిక, అండర్-18లో నిఖిల్ యాదవ్, రణధీర్, అజయ్, అండర్-20 విభాగంలో తుల్జారాం, అభిషేక్, ఇంద్రాణి, ఈశ్వర్, సాయి ఎంపికయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 140 మంది క్రీడాకారుల ఎంపిక పోటీలకు తరలివచ్చారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26, 27 తేదీల్లో సూర్యపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామిగౌడ్, టెన్నికాయిట్ జిల్లా అధ్యక్షుడు కాటం శ్రీనివాస్, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, శిక్షకులు కృష్ణకుమార్, నిశాంక్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, లీలాఆనందర్, ఫిజియో మహేశ్, సంతోశ్, ప్రవీణ్, దేవరాజు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌రెడ్డి

తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి పోటీలు

తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీసాయి స్కేటింగ్ అకాడమీ విద్యార్థులు ఏలూరు అర్జున్‌రామ్ వెయ్యి మీటర్ల పరుగులో, 500 మీటర్ల పరుగులో సమన్విత్‌రెడ్డి, అసని జగదీప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ నెల 14,15, 16,17 తేదీల్లో భువనగిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ సంపత్‌కుమార్ తెలిపారు. వీరిని సిద్దిపేట రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, సిద్దిపేట స్పోర్ట్స్ కన్వీనర్ పాల సాయిరామ్, డీవైఎస్‌వో నాగేందర్, పిండి అరవింద్‌యాదవ్, సంతోశ్ అభినందించారు.

సిద్దిపేట ఇందూర్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు పరిశీలన

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 13 : శాసనసభ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు సిద్దిపేటలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలను సీపీ శ్వేతతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ పరిశీలించారు. సిద్దిపేట నియోజకవర్గానికి సంబంధించి రిసెప్షన్, స్ట్రాంగ్‌రూమ్, ఓట్ల లెక్కింపునకు 'డి' బ్లాక్‌ను, హుస్నాబాద్ నియోజకవర్గానికి స్ట్రాంగ్‌రూమ్, ఓట్ల లెక్కింపునకు 'సి' బ్లాక్, గజ్వేల్ నియోజకవర్గానికి స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపునకు 'ఈ' బ్లాక్, దుబ్బాక నియోజకవర్గానికి స్ట్రాంగ్‌రూమ్, ఓట్ల లెక్కింపునకు 'ఏ' బ్లాక్‌లను పరిశీలించారు. ఆయా బ్లాక్‌ల్లో గదులను సిద్ధం చేయాలని మున్సిపల్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సామగ్రితో వచ్చే వాహనాలు వచ్చే మార్గాలు, పార్కింగ్ చేసేందుకు బ్లాక్‌లు వారీగా ఏర్పాటు చేయాలన్నారు. అన్ని బ్లాక్‌ల్లో, ఆవరణ చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్లకు సూచించారు. గట్టి పోలీస్ బందోబస్తుకు ప్రణాళికలు వేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్ ఈఆర్వోలు గరిమా అగర్వాల్, రమేశ్ బాబు, బన్సీలాల్, ఏసీపీ సురేందర్‌రెడ్డి, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 13 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ పోరాటం వెలకట్టలేనిదని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పీఆర్టీయూ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఆర్టీయూ పోరాట ఫలితంగానే ఉపాధ్యాయ బదిలీల్లో పారదర్శకత పెరిగిందన్నారు. పీఆర్‌సీ, ఐఆర్ విషయాల్లో ఉపాధ్యాయులకు మేలు జరిగేలా తనవంతు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను నిస్వార్థంగా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రెండేండ్లలో పీఆర్టీయూ సంఘానికి సలహాలు, సూచనలు అందించిన నాయకులు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు శశిధరశర్మ, ఇంద్రసేనారెడ్డి, వెంకట్‌రాజం పాల్గొన్నారు.

పూలను పూజించే గొప్ప సంస్కృతి మనది

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, విద్యార్థినులు

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 13 : పూలను పూజించే గొప్ప సంస్కృతి మనది అని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి రంగు, రంగు పువ్వులతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, మహిళా సాధికారిత విభాగాధిపతి సుజాత, హెరిటేజ్ క్లబ్ విభాగాధిపతి శ్రీనివాసులు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతిని గడించిందన్నారు. తెలంగాణ వారసత్వ పండుగ బతుకమ్మ ఏటా కళాశాలలో గొప్ప నిర్వహిస్తున్నామన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో జబర్దస్త్ ఆర్టిస్ట్ విశ్వ ప్రార్థని, అధ్యాపకులు వాసం శ్రీనివాస్, మధుసూదన్, అయోధ్యరెడ్డి, సుదర్శనం, శ్రీనివాసరావు, కొండల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాణి, హరిబాబు, భిక్షపతి ఉన్నారు.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే..

జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్

కలెక్టరేట్‌లో బీపీ చెకప్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 13 : మన ఆరోగ్యం, మన చేతుల్లోనే ఉందని, ప్రజల ఆరోగ్యం కాపాడాలనే ఉద్దేశంతోనే కలెక్టరేట్‌లో సెల్ఫ్ ఆటోమేటిక్ బీపీ చెకప్ మిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బీపీ చెకప్ మిషన్ జిల్లా వైద్యాధికారి కాశీనాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది తాము బీపీతో బాధపడుతున్నట్లు తెలియక సడన్ కార్డియాటిక్ స్ట్రోక్‌తో ఆకస్మిక మృత్యువాత పడుతున్నారన్నారు. బీపీ పరీక్ష చేయడంతో మీ ఆరోగ్యాన్ని మీరే పరిరక్షించుకోవచ్చనే ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలన

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 13 : సిద్దిపేటలో ఈ నెల 17న జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను శుక్రవారం సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి పరిశీలించారు. పట్టణంలోని నాగదేవత ఆలయం-సిరిసిల్ల రోడ్డు వైపు ఉన్న స్థలంలో జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు చకచకా చేయిస్తున్నట్లు సుడా చైర్మన్ తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర విద్యా వైజ్ఞానిక సభలను విజయవంతం చేయాలి

- జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి
- 15 నుంచి 17వరకు మహాసభలు

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 13 : మహబూబ్‌నగర్‌లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ తలపెట్టిన 5వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక రజతోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సిద్దిపేట ప్రతిభ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహించనున్నామన్నారు. మహాసభల్లో విద్యారంగంలో వస్తున్న నూతన ధోరణులు, పరిణామాలు, వృత్తి సమస్యలు, సామాజిక అంశాలపై చర్చిస్తారన్నారు. మూడు రోజుల పాటు జరిగే సభలో విద్యావేత్తలు, అధ్యాపకులు తమ సందేశాన్ని ఇస్తారన్నారు. మహాసభలకు జిల్లాలోని విద్యాభిమానులు, ఉపాధ్యాలయుల, వక్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు కిష్టయ్య, చంద్రభాను, మనీష్‌కుమార్, మల్లయ్య, వెంకటరమణారెడ్డి, ప్రవీణ్‌కుమార్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501

★Wanted Security Guards & Marketing Officers M/F at Sangareddy Sal: 25,000/-, Q: Degree, Age: 20 to 30 Yrs, Speak English & Hindi, Ph: 9490463421, 7972992966, 7093456901
NT-317970-All

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్ 6k. Ph: 9640468899, 9640258899.
NT-310350-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.